వూహించని కోరిక

పార్వతి అత్తగారితో పెళ్ళికి బయలుదేరింది. 'నువ్వు వెడితే చాలులెద్దూ; అదికూడా ఎందుకు' అని తల్లితో వెంకటేశ్వర్లు అన్నాడు. "సరిపోయె, నువ్వూ రాక, కోడల్నీ పంపకంటే, ఇంక నేనూ ఏమిటి, తగుదునమ్మా అంటూ పెళ్ళికి వెళ్ళటం ?" అని నరసమ్మగారు కొడుకుని అడిగింది.

పార్వతిని పంపటం ఇష్టం లేకపోయినా తల్లి ఏమనుకుంటుందో అని వూరుకున్నాడు వెంకటేశ్వర్లు.

నరసమ్మగారు కోడల్నే కాకుండా, పక్కింటివారి కోడల్నీ, కూతుర్నీ కూడా బెజవాడ చూద్దురుగాని రమ్మని పిల్చుకెళ్ళింది. బెజవాడ స్టేషనులో దిగేసరికి నరసమ్మగారి బంధువు మరొకరు కలసటంతో పెళ్ళివారి ఇంటికి ఇబ్బంది లేకుండా చేరుకున్నారు.

వూరు పదేళ్ళకీ ఇప్పటికీ ఎంతమారిపోయిందో అంటూ నరసమ్మగారు ఆశ్చర్యంతో ముక్కుమీద వేసుకొన్న వేలు తియ్యలేకపోతున్నారు వీధిలోకి వచ్చినప్పుడల్లా.

కోడల్నీ, పక్కింటివాళ్ళని తీసుకుని వూళ్ళోవున్న గుళ్లూ గోపురాలు అన్నీ తిప్పుకు ఇంటికి చేరేసరికి పెళ్ళివారు వచ్చేశారు అంటూ ఇంట్లోవాళ్లు వూరికే హడావుడి పడిపోతున్నారు. ముహూర్తం ఆ రాత్రికే. నరసమ్మగారు పెద్ద వాళ్ళలో కలిసిపోయి తిరుగుతోంది. పార్వతి పెళ్ళికివచ్చిన వొకరిద్దరితో పరిచయం చేసుకుని తన ముస్తాబుతో సతమత

మవుతోంది. పెళ్ళిబాజాలు మోగుతున్నాయి. పందిట్లో పెళ్ళివారి తాలూకు అంతా కూర్చున్నారు. ఆడపిల్ల వేపు వాళ్ళకి చోటులేక మూలలు పట్టుకు నిల్చున్నారు.

పార్వతి, కాయితంపువ్వులు కట్టిన స్తంభాన్ని పట్టుకు నిల్చుని చూస్తోంది. తలంబ్రాలు పోసుకుంటున్నారు. పెళ్ళికూతురు గడుసుదే, పళ్ళెమెత్తి పోసేస్తోంది అని పక్క వాళ్ళతో అంటోంది ఇటు తిరక్కుండా పార్వతి.

ఆనందం పార్వతిని పలకరిద్దామని అక్కడికి వచ్చి నిల్చున్నాడు. పార్వతి ఇటు చూడటంలేదు. ఆనందం వెనకే కొంతమంది వచ్చి కుర్చీ ఇక్కడ వేయించమంటారా అని మర్యాదచేసే హడావుడికి వెనక్కి తిరిగింది పార్వతి.

ముందు ఆనందాన్ని పోల్చుకోలేదు. కొద్ది క్షణాల్లోనే గుర్తుపట్టింది. సంతోషం మొహమంతా కదిలింది. మాటలు రాక మూతి ముడుచుకుంది.

ఆనందమే పలకరించాడు. పార్వతి చెప్పే మాటల కంటే బావశబ్దమే ఎక్కువ వినపడుతోంది. చాలామంది అమ్మాయిలు పార్వతి వెనక్కి చేరారు. వెనకనించి గుసగుసలు బయలుదేరాయి. ఆయన పెద్ద యాక్టరుట అని, మొన్న మనం చూసిన సినిమాలో లేడూ, అతనేననీ, మనం చూసినదాంట్లో చాలా బాగాచేశాడు అనీ, అన్నీ అతనికి వినపడాలనే అంటున్నారు.

'రేపు వుంటావా!' అని పార్వతిని అడిగాడు ఆనందం. వుంటానని తల వూపింది పార్వతి.

'మళ్ళా కలుద్దాము' అని వెళ్ళిపోయాడు ఆనందం.

పార్వతి చెయ్యపట్టుకు దూరంగా తీసుకెళ్ళారు కొంద రమ్మాయిలు. ఎల్లా తెల్సు అంటూ వూపిరి సలపకుండా ప్రశ్నలు వేస్తున్నారు.

ఆనందం తనకి మేనత్త కొడుకేనని చెప్పేందుకు చాలా రకాల చేష్టల్లో గర్వం కనపడేలా, "అబ్బబ్బ, అల్లా గుంపులా మీదపడతారేమిటె? ఆయనలో కొత్తవిశేషం ఏమివుంది, ఏమిటె! మనం చూసే మనుష్యుల్లాగే వున్నాడుగా? ఏటొచ్చీ అదృష్టం అందలం ఎక్కించింది, అంతే!" నంటూ, పార్వతి తనకి అతనితో మాట్లాడటంవల్ల వచ్చిన సంతోషం ఏమీ లేదు అని కనపడేలా మొహం పెట్టుకు కూర్చుంది, అరుగుచివర.

ఒకావె "నీకు తెల్సును కనక అల్లా అంటున్నావు, లేకపోతే ఆయనతో మాట్లాడ్డంలో వున్న గొప్ప అర్థమయ్యేది" అంది. "అబ్బా, దగ్గరనించికూడా ఎంత బాగున్నాడే"నని మరొక ఆవిడ నిట్టూర్చింది. "కొంచెం కనుముక్కు తీరువ వుందని" మురిసిపోయింది మరో ఆవె. "మా పిల్ల నిద్దర పోయింది కాని, ఆయన బసకి వెళ్లి కొంచంసేపు కబుర్లువిని వద్దాం అత్తా" అంటూ పార్వతి చెయ్యిపట్టుకు లేవతీసింది. ఇప్పుడు కాదులే రేపు ప్రొద్దుట వెళదాము. నాకు నిద్ర వస్తోంది అంటూ పార్వతి వళ్ళు విరుచుకుంది.

మరో మధ్యవయస్సావిడ, పళ్ళల్లో యిరుక్కున్న వక్క పలుకు బైటకిరాక అవస్థపడుతూనే, మాటలు మొదలుపెట్టి, "అబ్బాయి చిన్నతనంలో ఎంత అల్లరిచిల్లరిగా తిరిగేవాడో" నంటూ బోలెడు తెల్సినట్టు మొదలుపెట్టి. "అందుకేగా వీళ్ళ నాన్న యీ అమ్మాయిని యిచ్చి చెయ్యలేదు" అంటూ

పార్వతిని చూపెట్టి తను చెప్పాల్సినది అయిపోయినట్టు పన్ను కుట్టుకోవడం మళ్ళా మొదలుపెట్టింది.

"ఆయనకే ఇచ్చి మీ నాన్న చేసివుంటే మాతో అసలు మాట్లాడేదానివేనా?" అంటూ పక్కింటి అమ్మాయి పార్వతి బుగ్గలు సాగతీసింది.

మర్నాడు ఆనందం వచ్చేసరికి పార్వతి తల దువ్వు కుంటోంది. సగం జడ అల్లుకున్నది వదిలి "రా బావా!" అంటూ తన సామాను పెట్టుకున్న గదికి తీసుకెళ్ళింది.

గది అంతా సామాన్లు, అమ్మాయిలు విడిచిన బట్టలు, అద్దాలు, దువ్వెనలూ తిలకంసీసాలతో గందరగోళంగా వుంది. పార్వతి తన పెట్టెపైన చీరమడత పరచి ఆనందాన్ని కూర్చో మంది.

ఆనందం వేసుకున్న పల్చటి లాల్చీ వెనక పచ్చటి శరీరం మెరుస్తోంది. ఏదో వింతసువాసన గది అంతా పరుచు కుంది. పార్వతికి సంతోషం, భయం కలిసి మాటని పైకి రానివ్వటంలేదు.

"ఏమిటి ? కబుర్లు చెప్పు" అని ఆనందం పార్వతికేసి చూస్తున్నాడు.

పార్వతికి ఏమి చెప్పాలో తోచక "మీ ఆవిడ ఎల్లా అంటుంది, పాపాయిలు ఎంతమంది, అత్తయ్య ఎల్లావుంది" అంటూ గుక్కతిప్పుకోకుండా అడిగేసింది.

"మీ అత్తయ్య మంచాన పడింది. ఇంక, పాపాయి లంటావా ? మా ఇంట్లోకి ఎవరూ రావటంలేదు. మా ఆవిడ

వర్ణన నేను చేసేకంటే నువ్వే చూడరాదూ వచ్చి" అన్నాడు, నవ్వుతూ ఆనందం.

పార్వతి మళ్ళా ఏదో అడగాలనుకుంటూండగానే, అత్తగారు అక్కడికి వచ్చింది. మా అత్తయ్యకొడుకు అంటూ ఆప్యాయత యిమిడ్చి అత్తగారికి చెప్పింది.

"ఏం, నాయనా! నిన్ను గురించి మా కోడలు చెప్తూనే వుంటుంది. ఒక్కడవే వచ్చావా!" అంటూ కుశల ప్రశ్నలు అడిగింది.

"అవునండీ! పెళ్ళికొడుకు మా సినిమా కంపెనీలోనే పనిచేస్తున్నాడు అని పెళ్ళికి వచ్చాము. మీరూ పార్వతీ నాతో పట్నం రాకూడదా" అన్నాడు.

"అయ్యో! ఎంతమాట ? నీ బంధుప్రేమ అల్లాంటిది నాయనా. అబ్బాయిని వొక్కడినే వదిలివచ్చాము. పల్లెటూ రాయె. పాడిగొడ్లు వున్నాయి. అయినా మా చెల్లెల్ని పెట్టే వచ్చామనుకో. ఏమే, నువ్వు వెళ్ళి రెండు రోజు లుండి వస్తావా?" అని అడిగింది అత్తగారు.

లోపల వెళ్ళాలని వున్నా, పైకి వప్పుకోలేదు పార్వతి. "ఇప్పుడెందుకులే బావా? ఏవైనా కథలూ, కార్యాలు జరిగి నప్పుడు మేము గుర్తుండి నువ్వు పిలిస్తే సపరివారంగా వస్తాం, సరేనా!" అని నవ్వింది.

"ఎప్పటిమాటో ఇప్పుడెందుకులే. పోనీ వోసారి వెళ్ళు. పెంచి పెద్దచేసిందామె, మీ మేనత్తని చూసిరా. అతను రమ్మనమని అంత ఇదవుతున్నాడా, బాగుండదు వెళ్ళకపోతే. మా వాడికి నేను చెప్తాలే, వెళ్ళాక" అని కోడలితో అని

"మావాడిది పట్టి పిచ్చికోపం. ఇంట్లో వాళ్ళని ఎక్కడికీ వెళ్ళ కూడదంటాడు. కోపంవచ్చిన కాస్సేపు వూరుకున్నామంటే, మళ్లా ఎంత బాధపడతాడో అన్నందుకు" అంటూ తన కొడుకు స్వభావం ఆనందానికి చెప్పి మురిసింది, ముసలిహృదయం.

బావ మళ్లా రమ్మంటే వెళ్ళవచ్చులే అనుకుంది పార్వతి.

ఆనందాన్ని చూడ్డానికి చాలామంది అమ్మాయిలు కిటికీవూచల్లోకి చేరారు.

కొందరు నరసమ్మగార్ని తోసుకుంటూ గదిలోకి తొంగి చూస్తున్నారు.

ఆనందం కళ్ళు వయ్యారంగా అందర్నీ పరామర్శించి కిటికీచివర నిల్చున్న అమ్మాయిమీద నిల్చాయి.

తనకేసి చూస్తున్నట్లు గ్రహించిన సుభద్ర, పమిట జరుపుకుంది. పెదిమలు తడుపుకుంది. జుట్టు చెవులకిందికి జరుపుకుని, జడ ముందుకు లాక్కుంది.

ఆ అమ్మాయికేసి చూస్తూ ఆ అమ్మాయి చేష్టలకి కులుకుతూ నవ్వాడు ఆనందం.

ఆ నవ్వూ, చూపు కలిసి సుభద్రని ఇంద్రజాలంలా నిల్చోనివ్వటం లేదు. తన వంటిమీద బట్ట లేనంత సిగ్గు పడింది. ఆ సిగ్గులోనే అతనితో నవ్వు కలిపింది.

దూరంగావున్న సన్నాయి దగ్గరయింది. అంతా అటు వెళ్ళిపోయారు. నరసమ్మగారుకూడా వెళ్ళేందుకు హడావిడి పడింది.

'హమ్మయ్యా' అంటూ సుభద్ర గదిలోపలికి వచ్చి

ఆనందానికి దగ్గరగా నాజూగ్గా కూర్చుని. "మీ బావకి కాస్త కాఫీలాంటిది ఏమయినా ఇచ్చావా" అంటూ పార్వతిని అడిగింది.

"మా యిల్లా ఏమిటి? వెళ్ళి తెచ్చేందుకు" అంటూ మరో పెట్టెపైన పార్వతి కూర్చుంది.

సుభద్రకి ఎల్లా మాట్లాడాలో తెలియటంలేదు.

"అసలు సినిమావాళ్లు బయట బాగుండరంటారే, మీరు అలాకాదు. బైటకూడా" అని వాక్యం పూర్తి చెయ్యకుండానే, పార్వతికోసరం ఇద్దరమ్మాయిలు రావటం, పాట పాడాలంటూ మాట వినిపించుకోకుండా పార్వతిని ఇద్దరూ పట్టుకు లాక్కెళ్ళటం జరిగింది.

ఆనందం కూడా వెళ్లేందుకు లేచాడు.

సుభద్ర ఆనందాన్ని రాచుకుంటూ వెళ్ళి గుమ్మానికి అడ్డంగా చేతులుజాపి వెళ్ళద్దంటూ ప్రాధేయపడింది.

రుమాలుతీసి నుదురు అద్దుకుంటూ, 'ఏమిటి' అన్నట్లు సుభద్రకేసి చూశాడు.

"ఆ రుమాలు నాకిస్తారా" అంటూ చెయ్యిజాపి, "అబ్బా మిమ్మల్ని సినిమాల్లో చూస్తోంటే పిచ్చెక్కినట్టు అవుతుంది. నిజంగా చెపుతున్నా" అంటూ దగ్గరగాజరిగి నిల్చుంది.

ఈ మాటలు తరచు ఉత్తరాల్లో చదవటం అలవాటే. ఎదురుపడి అపరిచితుడనేనా భయంలేకుండా మృదువుగా అప్ప చెప్పటం వింటూంటే కొంచం ఆశ్చర్యం వేసింది ఆనందానికి.

సుభద్ర ఆనందం చేతిలోని రుమాలు తీసుకుంటూ

ఆ చేతిని తనబుగ్గమీద పెట్టుకు తన్మయంతో కళ్లుమూసుకుంది.

పార్వతికంఠంవిని ఆనందం దూరంగా బైటికి నడిచాడు.

సుభద్ర ఆనందంకూర్చున్న పెట్టెమీదకూర్చుని వచ్చే వూహాలకి తీగెలు అల్లుతోంది.

ఆరోజు అమ్మాయిలకంఠాల్లో ఆనందమే ప్రతిధ్వనిస్తున్నాడు. ఏదో పనిపెట్టుకు విడిదిలోకి వెళ్ళింది సుభద్ర. తన మనిషి అన్న భావంతో ఆనందాన్ని వెతుక్కుంటూ ఆరోజు అంతా అతనివెనకే తిరిగింది. సుభద్రపినతల్లి చాటుకిపిల్చి కూకలేసింది. "ఆ వెర్రేమిటే పెళ్ళయిన పిల్లవి, లేనిపోని వాదులు తెచ్చుకోకు" అంటూ మెల్లిగా వారించింది.

సుభద్రకి పినతల్లిపీకపిసుకుదామన్నంత కోపమువచ్చింది. ఐనా ఆనందంచూస్తాడేమోనని ఆకోపంలోప లేఅణచి పెట్టుకుంది.

ఆ రాత్రి రైలుకి వెడుతూ ఆనందం పార్వతికి చెప్పుదామని వచ్చాడు. అమ్మాయిలగుంపు, మధ్య మాటలు, నవ్వులు లైట్ల వెలుగులో పార్వతిపళ్ళు మెరుస్తున్నాయి. ఎందుకో అంత ఆపుకోలేని నవ్వు అనుకున్నాడు.

నరసమ్మగారు గుంపుని తప్పించుకుని వచ్చి, ఆనందాన్ని కూర్చోమంటూ కుర్చీదగ్గరకి జరిపింది.

పార్వతిని చూసేకళ్ళు తత్తరపడ్డట్టు, "ఏం లేదండ, నేను వెళ్ళాలి. చెప్పిపోదామని వచ్చాను" అంటూ నరసమ్మగారితో చెప్పుకున్నాడు.

తాళంచెవులజేబురుమాలు బొడ్డులోదోపుకుని, ఆనందానికి ఎదురుగావున్న స్తంభాన్ని చుట్టుకునిల్చుంది పార్వతి.

"మీ బావ వెళ్తున్నాడుటే," అంటూ అక్కడనించి ఎవరో పిలుస్తే వెళ్ళిపోయింది నరసమ్మగారు.

పార్వతిని తనతో ఊరికిరమ్మని పిలిచాడు.

ఆనందాన్నే చూస్తూనిల్చున్న సుభద్ర "వెడదాము" అంటూ, పార్వతి బదులు తనే వప్పేసుకుని నరసమ్మగారి దగ్గరకి హడావుడిగా పరుగెట్టింది.

'తొందరగా బయల్దేరు' అని పార్వతి కళ్ళల్లోకి చూస్తూ ఆనందం మళ్ళా అన్నాడు.

"అబ్బే, ఇప్పుడెందుకులే, ఈసారి మీ ఇంట్లో ఏవైనా కథలూ, కార్యాలు అవుతే తప్పకుండా వస్తామని చెప్పాగా!" అంటూ పమిటకొంగుని అనేకరకాలుగా చుడుతూ పార్వతి చెప్పింది.

వెనకనిల్చున్న నరసమ్మగారు, "అదేమిటే, పెద్దమనిషి రమ్మనిపిలిస్తే ఆమాటలేమిటి ?" అంటూ కోడల్ని కూకలేసి, "అల్లాగే వస్తుందిలే బాబూ" అంది.

"మీ అమ్మని నేను చూడలేకపోయినా ఆవిడ వుదార గుణం అంతా చెప్పుకోవటంవిన్నాను. ఎన్నోసార్లు మావాడితో కూడా చెప్పాను. వోసారి అమ్మాయి, నువ్వూ వెళ్ళి చూసి రండర్రా! పెద్దది అన్నాను. దీన్ని ఆవిడే పెంచిందిట కదూ!" అంటూ ప్రశ్న వేసినా వినకుండానే మరోమాట పెడుతోంది నరసమ్మగారు.

పార్వతికి అత్తగారి ధోరణి అలవాటే అయినా, అప్పు డప్పుడు ఆవిణ్ణి మాట్లాడకుండా చెయ్యాలనిపిస్తుంది. "ఎవరో పిలుస్తున్నట్టున్నా"రని, అత్తగార్ని పంపించింది.

ఆనందం చేతికేసి చూసుకుంటూ "ఆట్టే టైములేదు" అంటూ బయలుదేరాడు.

పార్వతి పెట్రోమాక్సులైట్లు పెట్టిన బల్లచివర ముడుచుకుని కూర్చుంది.

సుభద్ర, "తొందరగా లే, టైమైపోతుంది" అంటూ పార్వతి గెడ్డంపట్టుకు బతిమలాడుతోంది.

వెళ్ళటమా వద్దా అన్న సందిగ్ధం మనస్సులో తేలక ఎటూ చెప్పలేక వూరికే చూస్తోంది పార్వతి.

మరచెంబూ నీళ్లూ ఇవిగో నేపిల్లా అంటూ నరసమ్మగారు అక్కడకి మళ్ళా రావటంతో ఈసారి బయలుదేరింది, పార్వతి.

సుభద్రపినతల్లికి సుభద్ర హడావిడి నచ్చలేదు, "పిన్నీ, నీ కోడలికి చుట్టమైతే మా పిల్లని వెళ్ళమంటున్నావుట దేనికి" అంటూ నరసమ్మగారితో అంది.

"నే నెందుకు వెళ్ళమంటానూ? అది సర్దాపడితే పోనీ వెళ్లవే, అన్నాను. ఐనా వెడితే ఏమిపోయింది నీకు" అంటూ సుభద్ర పినతల్లితో అంది.

పార్వతిని మళ్ళా మూడోనాటికల్లా తిరిగిరమ్మనమని, తను ఇక్కడేవుంటానని చెప్పి పంపింది నరసమ్మగారు.

సుభద్రని, పార్వతిని, రైలు ఎక్కించేందుకు పెళ్ళి పెద్దల్లో ఒకరు స్టేషన్ కి వచ్చారు.

ఆనందంచుట్టూచాలామందిజనం పోగయ్యారు. పార్వతి, సుభద్రా దూరంగా నిల్చుని రైలురాకకోసంచూస్తున్నారు.

రైలుకూత వినగానే అంతా అటుతిరిగి హుషావిడిగా కదుల్తున్నారు. ఆనందాన్ని రైల్లోఎక్కించేందుకు రైలుపెట్టెతో మనిషికూడా రావటంచూసి ఆశ్చర్యపోయింది సుభద్ర. వీళ్ళని కూడా ఆ పెట్టెలోనే ఎక్కించాడు కూడా వచ్చిన పెద్దమనిషి.

పార్వతి పెట్టెకి రంగు వెలిసిపోయింది. పైగా పాత పెట్టె. పెళ్లివారి యింట్లో తాళంపెడుతూంటే గొళ్ళెంకూడా విరిగిపోయింది. దానికిసాయం డబ్బాలా ఎత్తువకటి. దేనికిందా ఇమడదు. పెట్టెలో అంతా ఒక్కోసారి ఆ పెట్టెకేసి చూస్తున్నారు. వాళ్ళు చూసినప్పుడల్లా పార్వతికి ఎంతో చిన్నతనం వేస్తోంది. అసలు రాకుండావుంటే పోయేది. ఈ సుభద్ర తెచ్చి పెట్టిందా బెడద అని మనస్సులోనే తిట్టుకుంది, తను ప్రయాణమైనందుకు.

రైలుకదిలినా కొందరు నిల్చునే ఆనందంతో కబుర్లు చెపుతున్నారు. సుభద్ర మధ్యమధ్య ఏవేవో ప్రశ్నలువేస్తోంది. అందులో బక్కపల్చగా తెల్లగావున్న కుర్రాడు, సుభద్ర పలికినప్రతి మాటనీ మళ్ళీఅని తెగమెచ్చేసుకుంటున్నాడు.

కొంతసేపు వాళ్ళతో కలిసి నవ్వినా, ఆనందం ఆవలింతలు మొదలుపెట్టాడు. పార్వతి మధ్యమధ్య కునుకు తీయటంచూసి, వెనక్కి ఎత్తివున్న పరుపులాంటి బల్లని కిందికి విడిచి "నువ్వు ఇటు పడుకో" మని పార్వతికి చెప్పాడు ఆనందం.

పమిటకొంగు తలపైన కప్పుకుని సగంచోట్లో ముడుచుకు పడుకుంది పార్వతి.

సుభద్రకి ఆరాత్రి జీవితంలో మొదటి పర్వదినంలా వుంది. ప్రతిమాట సంతోషంతో మునిగి తేలుతోంది. తెల్లవారు జామున పార్వతిపక్కన ఖాళీచేసుకు పడుకుంది.

స్టేషన్ లోపలికి రైలువెళ్లి నిల్చింది. ఎన్నోరైళ్ళు కూస్తున్నాయి, వెడుతున్నాయి, వస్తున్నాయి. ఎంతమందో గుంపులుగా వెడుతున్నారు, విడిచిపోతున్నారు. రంగురంగుల బట్టలు, రకరకాల మనుషులు.

అందర్నీ చూస్తూ పార్వతి నిల్చుంది. "అల్లా నిల్చుండి పోకూడదు" అని మెల్లిగా వినుకొన్నట్టు చెప్పాడు ఆనందం.

పార్వతికి అభిమానం వచ్చింది. తలవంచుకు ఆనందం వెనకే నడుస్తోంది. సుభద్ర మిగిలినవాళ్ళతో కలిసినవ్వుతూ, మాట్లాడుతూ వస్తోంది.

ఆనందం ఎక్కిన కారులో ఎక్కికూర్చుంది పార్వతి. అలాగ ఒక్కసారి చెప్పగానే వినాలి అంటూ ఆనందంపార్వతిని మెచ్చుకున్నాడు.

సుభద్ర మిగిలినవాళ్ళని విడిచివచ్చేందుకు చాలా విచారంగా మొహంపెట్టి కారుఎక్కి కూర్చుంది.

ఆ కారునిల్చినచోటు చాలా ఇంపుగావుంది. చూచేందుకు పెద్ద పువ్వులతోటమధ్య అద్దాలతలుపులతో కట్టినమేడ, ఎక్కడచూసినా రంగులముద్దల్లా గులాబీపూలు గుంపులుగా విచ్చి గాలికి మెల్లిగా వూగుతున్నాయి. ఆనందం మెట్లు ఎక్కి మేడపైకి వెళ్లాడు. పార్వతి వీధిమెట్లమొదటే నిల్చుని తోటకేసి చూస్తోంది. ఆనందం కేక వెనుకనించి వినపడగానే తలదింపుకు లోపలికివెళ్ళింది.

మేనత్తగది వెతుక్కుంటూ వెళ్ళింది పార్వతి. వయస్సు మళ్ళిన జానకమ్మ కళ్ళజోడు సవరించుకుని పార్వతిని పోల్చుకునేందుకు ప్రయత్నించి, వూరు, పేరు అడగటంమొదలుపెట్టింది. "వున్నాడా అబ్బాయి" అని పార్వతినే అడిగింది జానకమ్మ.

"నన్ను మర్చిపోయావు చూశావా," అంటూ మేనత్తని వెళ్ళి కావలించుకుంది పార్వతి.

జానకమ్మ కళ్ళు తడిశాయి. "నువ్వాటే" అంటూ చాలాసేపు మాటరాక కళ్ళతో ప్రశ్నలువేస్తోంది. ఇద్దరూ

తనివితీరేదాకా ఎన్నో మాటలు చెప్పుకున్నారు. ఎందరి విష యాలో అడిగి తెల్సుకుని ఆరోజులకోసం మనస్సులో ఏకు తోంటే బోసినోటితో నెమరు వేసుకుంటూంటే మళ్ళా వెనక్కి పిల్చాయి నీడలు.

ఆరోజు అంతా జానకమ్మ ప్రశ్నలకి సమాధానం చెప్పటమే సరిపోయింది పార్వతికి.

సుభద్ర ఆ నిమిషంలోనే ఇల్లుఅంతా తొంగిచూసి వచ్చింది. ఆనందాన్ని అడిగి పైకివెళ్ళి వాళ్ళల్లో కలిసిపోయింది. జానకమ్మ కోడలిని వకసారి కిందకి రమ్మనమని కబురుపెట్టింది.

ఎప్పుడో మధ్యాహ్నానికి రాధాకుమారి తయారై వచ్చింది. ఆవిడవెనక సుభద్రకూడా దిగింది. ఈసారి సుభద్ర అని తెలిస్తేతప్ప కొత్తవాళ్ళు కనుక్కోవటం కష్టమే. ఇద్దరూ ఒకేరకం బట్టలు కట్టుకున్నారు. జుట్టునికూడా ఆవిడముడిలాగే వేసుకుంది.

ఆవిడ ఎత్తుజోళ్ళే తనూ తొడిగింది. పార్వతి ఆశ్చ ర్యంగా చూడటం చూసి, "నువ్వూ రావే" అంటూ పార్వతి చెయ్యిపట్టుకు లాగింది, సుభద్ర.

తాళాలగుత్తి, అత్తగారిపక్కమీదకి విసిరి "ఎందుకూ కబురుపెట్టారుట" అని అడిగింది, పెదిమలని గుడ్డతో వత్తు కుంటూ రాధాకుమారి.

"మరేంలేదు, మా మేనకోడలు వచ్చింది. నీకు చూపెడదామని" అంటూ జానకమ్మ పార్వతికేసి చూసింది. "ఇంతేకదా! ఇంకా ఏమిటోనని భయపడిపోయాను. మరి నేను వెడుతున్నా. వచ్చేందుకు కాస్త పొద్దుపోతుందేమొ. మీ అబ్బాయి వస్తే చెప్పండి; బహుశా ఆయనకూడా

ఆ పార్టీకే రావచ్చులెండి" అంటూ జోళ్ళు చప్పుడు చేసు కుంటూ వెళ్ళిపోయింది. ఆవిడ వెనకే సుభద్రకూడా వెళ్ళింది. కారులో డ్రైవరు కూర్చునేచోట, రైల్లో కలిసిన ఎర్రటి అబ్బాయి కూర్చునివున్నాడు.

జానకమ్మ సుభద్రని చూపెట్టి "ఆ అమ్మాయి ఎవరే" అని అడిగింది. "మా అత్తగారికి ఏదో బంధువే" అని ముక్త సరిగా జవాబిచ్చింది పార్వతి.

"చూశావా, ముక్కూ మొహం ఎరక్కపోయినా తనకి ఇష్టమైతే తనగుడ్డలు కట్టబెట్టి వూరంతా తిప్పుతుంది. నేనుచెప్పా నని నిన్ను పలకరించనైనా లేదు" అంటూ బాధపడిందిజానకమ్మ.

"ఆ పోనిస్తూ" అంటూ ఆ పక్కగావున్న మంచము పైన నడుంవాల్చింది పార్వతి.

ఎంతసేపు నిద్రపోయిందో లేచేసరికి ఇల్లంతా దీపాలే. తోటలో రంగురంగుల దీపాలు ఆరుతూ వెలుగుతూ తిరుగు తున్నాయి. అన్నివేళలా పంపులోకి వేడినీళ్ళు ఎల్లావస్తాయో అడిగి తెల్సుకోవాలనివున్నా నవ్వుతారేమోనని భయపడి వూరుకుంది. స్నానంచేసి చుట్టూ జరీవున్న పుల్లేటికుర్రు చీర తీసి కట్టుకుంది. పల్చటి తెల్ల పట్టుజాకెట్టు తొడిగి అద్దంలో చూసుకుంటోంది. ఆ ఇంట్లో ఏముందో, తనకీ అందమైన బట్టలు కట్టుకోవాలనిపిస్తోంది అనుకుంటూ నవ్వుకుంది.

వెనకనించి చూస్తున్న ఆనందం తన్నిచూసే నవ్వు తోంది అనుకుని, "ఎందుకో చెప్పు" అని పార్వతి కెదురుగా వున్న వుయ్యాలబల్లమీద కూర్చున్నాడు.

"అబ్బే, ఏం లేదు. మీ ఇంట్లోనే వుండిపోవాలని

వుంటుందనుకో, అప్పుడు ఏమిచెయ్యటం అని నవ్వుతున్నా" అని మాటమార్చింది పార్వతి.

"మాటమీదే వుండాలి తెల్సిందా" అంటూ వుయ్యాలదిగి పార్వతిదగ్గరికి వచ్చాడు ఆనందం.

జానకమ్మ కర్రచప్పుడువిని మళ్ళీ వుయ్యాలదగ్గరకి వెళ్ళాడు ఆనందం. "పువ్వులు ఇవిగోనే" అంటూ పార్వతి తల్లో పెట్టి అక్కడే కూర్చుంది జానకమ్మ.

చాలాసేపు చిన్నప్పటిముచ్చట్లు చెప్పింది.

ఆనందానికి, పార్వతికి జరగాల్సినపెళ్ళి ఎల్లా నిల్చిపోయిందో చెప్పి నిట్టూర్చింది జానకమ్మ.

పార్వతిలో భావం బయటపడకుండా మాటమార్చి "మీ కోడలి పుట్టిల్లేవూరు" అని మేనత్తని అడిగింది.

"ఆఁ, మీ నాన్నదగ్గరకి అస్తమానం చేబదులుకి వచ్చేవాడు గేపకముందా! ఆ వెంకటనారాయణ మేనగోడలే ఈ పిల్ల" అంటూ తేలిగ్గా చెప్పింది.

పొద్దుపోయేదాకా అవీ ఇవీ చెప్పుకుంటూ కూర్చున్నారు. ఆ దీపాలవెలుగులో ఎంత పొద్దుపోయిందీ కూడా తెలవలేదు. పదకొండోగంట వినగానే చలనంకలిగి లేచి వంటవాడికి పురమాయించాడు ఆనందం. ఇప్పుడేంతిండి బాబు, నాకు వద్దు అంటూ వెళ్ళిపోయింది మేనత్తవెనకే పార్వతి.

ఆనందం బలవంతంమీద తిరిగివచ్చి కొద్దిగా తిని లేచింది పార్వతి. "మీ సంసారంకబుర్లు చెప్పు" అంటూ మొదలుపెట్టాడు ఆనందం.

"ఆ, మాకేమి వుంటాయి. పొద్దుగూకేసరికి తిని చెయ్యటం. ఆయన చుట్టకాలుస్తూ వూరమ్మట తిరిగివచ్చేసరికి

మాకో నిద్ర అయిపోతుంది. మళ్ళా కోడికూతవేళ లేచి పనుల్లో పడ్డామంటే మళ్ళా భోజనాలైందాకా ఏదోవకటి సరిపోతుంది. మళ్ళీ వో కునుకుతీసి లేచేసరికి సంధ్యగుమ్మాలు చిమ్మటం, సాయంత్రంపనులూ అవీ సరిపోతాయి.

“మీలా మేమేం జమిందార్లం కాముగా” అంది పార్వతి. “నిద్రవస్తోందా పార్వతీ” అని ఆప్యాయంగా అడిగాడు ఆనందం. లేదని తలవూపింది పార్వతి. అయితే మా వెనకవున్న ఇల్లు చూద్దువుగాని రా అని పిలిచాడు ఆనందం. ఆ దారిలో మెత్తనిగడ్డి పరచినట్టు వుంది. పైకి చూసేందుకు ఇల్లు ఏమంత కనపడకపోయినా లోపలికి వెళ్ళాక పార్వతికళ్ళు జిగేలుమని మెరిశాయి. ఏదో ఇంద్రభవనం వర్ణనలా వుంది. గదులన్నీ తిరిగింది. ఇంటిచుట్టూ చూసింది. చెరువుదగ్గరికి నడిచింది. మళ్ళీ ఇంటిముందుకే చేరింది. “చాలా బాగుంది” అని ఆనందంతో అని “ఇంక వెడదాము” అంటూ బయటికి నడిచింది. ఎదురుగా పాలరాతితో కట్టిన గట్టెక్కి కూర్చుంది. కొంగు పరుచుకు పడుకుంది. ఆనందం రాలేదు. పార్వతికి కునుకుపట్టింది. తోటలో దీపాలు ఒక్కసారి ఆరిపోయాయి. పార్వతికి మెళుకువ వచ్చింది. కీచురాళ్ళంటే భయం. తనదగ్గరగా ఎవరో కూర్చున్నట్లు అలికిడవుతోంది. మాట్లాడాలంటే భయం కంఠాన్ని చుట్టు కూర్చుంది. ఏదో చెయ్యి వీపునిమురుతోంది. తను దూరంగా జరుగుతోంది. ఆకారం దగ్గరవుతోంది. పార్వతి జరిగి జరిగి గట్టుచివరకు చేరింది. పడకుండా ఆ చేతులు ఆపాయి.

పార్వతి ఏదో చెప్తోంది. కీచురాళ్లధ్వనిలా మాట పైకి రావటంలేదు. "వద్దు పాపం, తప్పు. తరవాత చెప్పు" అంటూ నవ్వుతున్నాడు. ఆ నవ్వు చీకటిని ఇంకా దట్టంగా చేసి పెద్దకొండలా చుట్టూ పెరిగి నిల్చింది. చీకటిని కాల్చి కోరిమి, ఆకాశంలో తెల్లగీర వెలిగింది...ఆనందం, పార్వతి చెయ్యపట్టుకు లేవతీశాడు. ముందు బంగళా తలుపులు తీసే వున్నాయి. పార్వతి తూలి వుయ్యాల బల్లకి తగిలింది. రహస్యం తెల్సుకున్నట్లు చప్పుడుచేశాయి గొలుసులు. జానకమ్మ లేచి లైటువేసింది.

"నువ్వు ఈ వట్టి బల్లమీదే పడుకున్నావా? అయ్యో" అంటూ దుప్పటి తెచ్చి పరచింది.

ఇక్కడ భయంగా వుంది నీ గదిలో పడుకుంటానంటూ పార్వతి జానకమ్మగదిలోకి చేరింది.

సుభద్ర ఎప్పుడు వచ్చిందో తెలీదు. ఐనా పార్వతి లేచాకే నిద్రలేచింది.

తను చూసినవి వింతలుగా, గుక్కతిప్పుకోకుండా పార్వతితో చెప్పుకుపోతోంది.

"మనం ఏముందిలే అనుకుంటాము! మేము ఎన్ని గంటలో చూసింది ఒక్క పావుకూడా కాదుట" అంటూ సినిమాతియ్యటం గురించి సుభద్ర చెప్తోంది.

అప్పుడే నిద్రలేచివ రాధాకుమారి కాఫీకోసం అయ్యర్ని తిడుతోంది.

ఆనందం వుయ్యాలమీద కూర్చుంటూ "గొలుసులు చప్పుడు చెయ్యకుండా వుండేలా చేస్తే బాగుండును" అంటూ పార్వతి కేసి వారగా చూశాడు.

పార్వతి మెల్లగా స్నానాల గదికి చేరింది. రాధాకుమారి స్నేహితురాండ్రు రావటంతో మేడపైకి వెళ్ళిపోయింది. సుభద్ర వుయ్యాలకి మరో చివర కూర్చుంటూ "మిమ్మల్ని తీసేటప్పుడు చూడాలనివుంది" అంటూ ఆనందాన్ని చేత్తో కొట్టి చెప్పింది. "ఏముందీ, ఇక్కడే ఆడేస్తా చూడండి" అంటూ తను చెప్పాల్సిన మాటలు కొన్ని చెప్పి, అటూఇటూ తిరిగి గెంతి హంగామా చేస్తున్నాడు ఆనందం.

పైనుంచి రాధాకుమారి గోల చెయ్యవద్దనికబురు పెట్టింది. 'చిత్తం, దేవీ' అంటూ ఆనందం ముడుచుకూర్చున్నట్టు నటించటం చూసి సుభద్ర పగలబడి నవ్వుతోంది. ఇంకా నవ్వేలా వికారాలు చేస్తున్నాడు ఆనందం. ఆరోజు అంతా ఆనందం వెనకే తిరుగుతోంది సుభద్ర. రాధాకుమారికి ఎప్పుడు కోపంవస్తుందో తెలీక ఆనందాన్ని తెగపొగిడింది సుభద్ర.

దానితో ఆనందాన్ని మేడదిగి కిందికిరాకుండా చేసింది రాధాకుమారి.

సుభద్రకి, ఆనందంపక్కన కూర్చుని కారులో తిరగాలన్న కోరిక తీరనేలేదు. ఆ మర్నాడు బయల్దేరకపోతే నరసమ్మగారికి కోపంరావచ్చునన్న భయంతో ఆ సాయంకాలం ఆనందంవున్నగదికే వెళ్ళి అడిగింది, వూరు చూపెట్టమని.

పక్కగదిలోవున్న రాధాకుమారి వెంటనే డ్రయివర్ని పిల్చి తీసుకువెళ్ళమని పురమాయించింది.

ఆనందం సాయంత్రం వెళ్ళి మళ్ళా మర్నాడువచ్చాడు. జానకమ్మ తెప్పించిన చీర పార్వతిని కట్టుకోమంది, ఆనందానికి చెప్పేందుకు మేడపైకి వెళ్ళింది పార్వతి. రాధాకుమారి గుమ్మంలో నిల్చుంది. ఆనందం పాదాలకి ప్రణామం చేసింది. పార్వతితల నిమిరాడు మెల్లిగా. కోపంతో రాధాకుమారి కిందికి వచ్చేసింది.

సుభద్రని, పార్వతిని రైలుకి పంపింది రాధాకుమారి. కాలంజరిగి పెరిగినకొద్దీ గతంలో జరిగినవి గతానికే వదిలి జీవితాన్ని నిండుకుండలా నిల్పుకుంది. సుభద్రకి, జీవితం అంటే నిర్లక్ష్యంగా వుంటూ, ఎప్పుడూ విసుగుతో, ఒక్కర్తే శూన్యం లోకి చూస్తూ కూర్చోవటం, లేకపోతే ఆనందంపేరు చెప్పి నవ్వటం అలవాటయ్యాయి. ఈ చేష్టలకి విసుగుపుట్టి, పుట్టింటికి పంపేశారు అత్తవారు. ఆ పిల్లకాపురం, సంసారం చెడు పాడుచేశాడని ఆనందంపై లోకం అభాండం విసిరింది. సుభద్ర కోరికలు గాలిగుఱ్ఱం కళ్లెంలా అందకుండా ఎక్కడో తిరుగుతూ కిందకి దూకుతూ ఉన్నాయి. దారితెలియని యాత్రికుడిలా జీవితాన్ని డొంకపై కప్పి, కారకులు ఎవరో తెల్సా అనే కథలు మిగిలినా, సుభద్రకి జవాబుచెప్పేస్థితి ఏనాడో మించి పోయింది.